# అమ్మంటే తెలిసిందా నాన్నారూ!

అవధానుల జగన్నాథరావు –
మల్లంపల్లి గాంధీ రామారావు

ఈ పదిహేను రోజుల్లో ఇది నాలుగో ఉత్తరం, అమ్మ దగ్గర్నుంచి. ఉత్తరాన్ని చించి, ముక్క ముక్కలు చేసి, కిటికీలోంచి బయటికి పారేయాలనిపించింది.

కోపాన్ని కాస్త నిగ్రహించుకొని, కసిగా ఉత్తరాన్ని ఉండచుట్టి జేబులో పెట్టుకున్నా.

ముప్ఫయ్యేళ్ళు వచ్చినా, ఏమీ తెలియని చిన్న పిల్లాడిలా నన్ను చూసే ఈ తత్వమంటేనే నాకు మహా చికాకు

కలసి మెలసి పెరిగిన తోబుట్టువు ఇంట్లో కూడా నాలుగు రోజులు సర్దుకుపోలేని అమ్మవే మనాలో అర్థం కాలేదు

నేను పుట్టినవెంటనే నాన్న పోవడమే ఈ అనర్థాలన్నిటికీ కారణమేమో ?

కాలు క్రిందపెడితే కందిపోతాడన్నంత అపురూపంగా పెంచుకున్నా... క్షణం వదలలేని ఈ అభిమానం...

ఉక్కిరి బిక్కిరిచేసే ప్రేమా. ప్రాణాలు తోడేస్తున్నాయి అనిపిస్తోంది.

ఇవాల్టికి సమంగా తనని మా మయ్యయింట్లో వదిలి నెల్లాళ్ళయింది— ఈ మాత్రం దానికే నా గురించి యింత బెంగా ?

నేనేం మరీ చిన్న పాపాయిని కానే?

నాకూ పెళ్ళయింది..! త్వరలోనే తండ్రిని కాబోతున్నాకూడా!

పెళ్ళయి సంవత్సరంన్నర అయిందన్న మాటేగాని..

రాధతో ఒంటరిగా గడపడం... రాధ చేతి వంట రుచి చూడ్డం ఈ నెల్లాళ్ళు మాత్రమే.

పెళ్ళయి కొత్తగా సంసారం పెట్టినా... ఇంటికి నిండుగా, ఇద్దరికీ నీడలా, ఎక్కడ చూసినా అమ్మే.

రాధ తల్లి కాబోతుందని తెలిసిన దగ్గర్నుంచి... అంతకు ముందు పెట్టే ... కాఫీ కూడా పెట్టనీయడం మానిపించేసింది అమ్మ. గట్టిగా నవ్వుకుందామనుకున్నా వీలులేని అద్దె కొంప . అనుక్షణం ఎవరో పక్కనే ఉన్నారన్న ఆలోచన, నా ఆనందానికి ఎన్ని అవరోధాలు కలిగించిందో ఎలా చెప్పను అమ్మకి.

అందరి అత్తల్లా... కోడళ్ళకి అరళ్ళు పెడుతూ, అమ్మ కూడా ప్రవర్తిస్తే పరిస్థితులు మరోలా ఉండేవేమో ?

తల్లి కూతుళ్ళు కూడా యిలా ప్రవర్తించరేమో ... అనిపిస్తుంది రాధనీ అమ్మనీ చూస్తుంటే.

అమ్మకన్నా ఆరాకులు ఎక్కువన్నట్లు ప్రవర్తించేది రాధ. ఆరుమీద మూడు పద్దా, మూడుమీద ఆరు పద్దా, అమ్మకి భగవద్గీతలోని శ్లోకాలు వినిపించి వస్తేగాని... రాధా దర్శనం జరిగేది కాదు.

కడుపులో నలుసు పడేంత వరకూ, ఉదయాన్నే పూజలో ఉన్న అత్తగారికి కాఫీ పెట్టి ఈయడం రాధ వంతు.

ఆ తర్వాత ఆ డ్యూటీ కూడా అమ్మే తీసుకుంది... కోడలెక్కడ అలసిపోతుందేమోనని.

ఎన్ని మధురమైన రాత్రులు అమ్మ భగవద్గీత శ్రవణంలోనూ, మధురమైన ఉదయాలు, ఉదయాన్నే సూర్యోదయానికి ముందే చేసి పెట్టి యిచ్చే కాఫీలోనూ కొట్టుకుపోయాయో ... ఎవరికి చెప్పుకోను ? తనని చెప్పుతో కొట్టినా, చిరునవ్వుతో సహించగల ఓర్పున్న రాధ అమ్మమీద మాత్రం ఈగ వాలనీయదు.

మనసులోని ఈ బాధల్ని ... రాధతో చెప్పి అభాసుపాలవడంకన్నా తెలివితక్కువ తనం మరొకటి లేదు.

ఆలోచనల కంతరాయం కలిగిస్తూ ఆఫీస్ టేబిల్‌మీది ఇంటర్‌కమ్ ఫోన్ ట్రింగు ... ట్రింగు .. ట్రింగ్ మని మోగింది. రిసీవర్ ఎత్తా.

"సార్ ! ఆ లాంగ్‌లేజీ రోడ్డు కాంట్రాక్టు ఎగ్రిమెంటు ఫారాలు తెమ్మంటారా సార్ ! తమరు రేపట్నించి వారం రోజులపాటు సెలవులో ఉంటారు" అన్నాడు వినయంగా హెడ్ క్లర్క్ వీరేశం.

"ప్లీజ్ బ్రింగ్ దెమ్ .. ఆఁ .. ఆ వచ్చేటప్పుడు మన జె.యి. గార్ని కూడా రమ్మని చెప్పండి ... " అని ఫోన్ క్రేడిల్‌మీద పెట్టాను.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది .. సాయంకాలం ప్రయాణం సంగతి · కాల్‌బెల్ నొక్కి డ్రైవర్ని పిలవమని చెప్పాను ప్యూన్‌కి.

"సార్ !" అన్నాడు డ్రైవర్ డేవిడ్.

"ఏం ? కారు రెడీయేనా ?" అన్నాను ఫైల్లోంచి తల ఎత్తకుండా.

"అవును సార్! ఆయిలు, బ్రేకులు, లైట్లు, టైర్లు అన్నీ పెర్‌ఫెక్ట్‌గా ఉన్నాయి. అపైన జీసస్ దయ సార్ !" అన్నాడు డేవిడ్.

నవ్వుకున్నాను మనసులోనే డేవిడ్ నమ్మకానికి.

ఫైళ్ళమీద సంతకాల పనులు కానిచ్చి, అందరికీ చేయవలసిన పనులు విశదీకరించి, ఎంతో ఆనందంగా కారు ఎక్కాను.

* * *

"రాధా ఎంతో హాయిగా ఉందికదూ...ఈ వెన్నెల్ల రాత్రిలో ఒంటరిప్రయాణం" అన్నాను స్టీరింగ్ తిప్పుతూ.

"అబ్బాయి గారూ నావైపుకన్నా...రోడ్డుకేసి చూడ్డం ఆరోగ్యానికి మంచిదేమో?" అంది రాధ కిటికీలోంచి బయటికి చూస్తూ.

"ఎక్కనున్నది డ్రైవర్ డేవిడ్ కాదనీ, తమ శ్రీవారు రాజశేఖర్ అని తెలుసుకుంటే కాస్త బాగుంటుందేమో ?" అన్నాను రాధవైపు జరుగుతూ.

"రాధా వెన్నెల రాత్రి... నున్నటి తారు రోడ్డు మీద కారులో ప్రయాణం... కన్నుల పండవైన జంట... అన్నిటికీమించి... అనువైన ఏకాంతం... ప్లీజ్ కమ్ క్లోజ్" అన్నాను రాధను దగ్గరగా లాక్కుంటూ.

"చూడు బుజ్జీ! మనిద్దరం వెళ్తున్నది హనీమూన్‌కి కాదు. నాపురుటికి... నా పుట్టింటికని జ్ఞాపకం పెట్టుకుంటే కాస్త బాగుంటుంది. అట్టే హడావుడి చేస్తే... అమ్మ వెనకసీట్లో లేదని సంబరపడుతున్న మిమ్మల్ని... మీ అబ్బాయి అల్లరి పెడ్తాడేమో? అంది రాధ దగ్గరగా జరుగుతూ.

ఎందుకో అనిపించింది... ఆ క్షణంలో రాధ మామూల్మాలుగా లేదనీ, కొంచం కోపంగా ఉందని... వెంటనే తెలిసిపోయింది రాధ కోపానికి కారణం ఏమిటో!

"రాధా ! అమ్మని ఇంకా తీసుకురాలేదని కోపమొచ్చిందా !" అన్నాను.

అమ్మ పేరు వింటే చాలు... రాధ బుంగ మూతి కోపాలు మటుమాయమవుతాయని తెలిసి.

"నాకెందుకూ మధ్యలో కోపం ? అత్తయ్యను తీసుకురాకపోయినా, ఆవిడ మీకు వ్రాసిన ఉత్తరాలు నాకు చూపించకపోయినా, ఉత్తరాలు రాలేదని మీరు అబద్దాలు ఆడినా..., నేనెవర్తెను మధ్యలో కోపం తెచ్చుకునేందుకు ?" అంది రాధ బాధగా.

"నిజం రాధా ! ఉత్తరాలు అస్సలు రాలేదు" అన్నాను. దొంగతనం చేస్తూ దొరికిపోయిన దొంగలా.

అనుకోకుండా చేయి ఫేంట్ జేబుమీదకి పోయింది. ఉండచుట్టి పడేసిన ఉత్తరం అలాగే ఉంది

"అబద్దాలాడ్డానికికూడా కాస్త తెలివి తేటలు కావాలి. మరి అత్తయ్య నాకు వ్రాసిన ఈ ఉత్తరం సంగతేంటి ?" అంది రాధ జాకెట్‌లో మడచిపెట్టిన ఇన్‌లాండ్‌ను పైకి దీస్తూ.